# హై'టెక్కు' అమ్మాయి

"మీ పేరు?"

"సుబ్బారావు"

"ప్స్!"

"పేరు మరీ పాత చింతకాయ పచ్చడికి గ్రాండ్ ఫాలా వుంటేనూ..."

"ఏం? అలా వుండకూడదా?"

"అని కాదు. ఏ సమీరో, సుకుమారో వంటి మోడ్రన్ నేమ్స్ అయితే ఫెంటాస్టిక్‌గా ఉండేదని!"

"పేరులో ఏముది? పదిమందిలో మంచి పేరు తెచ్చుకుంటే చాలు"

"నా పేరు చూడండి. నిమీలిత! ఎంత బావుందో?"

"అవున్లెండి. మీలాగే చాలా బాగుంది."

"అద్సరే! జాబేం చేస్తున్నారు?"

"జడ్పి స్కూల్లో, స్కూల్ అసిస్టెంట్ పోస్టండీ!"

"హో! బడిపంతులా?"

"ఏం? అది మాత్రం ఉద్యోగం కాదాండీ?"

"ఎందుక్కాదూ? గుడ్డిలో మెల్ల నయమేలెండి. అలవాట్లేమైనా ఉన్నాయా?"

"యూమీన్..."

"స్మోకింగ్, డ్రింకింగ్... వగైరా!"

"సారీ! అవేవీ గిట్టవు."

"వ్వావ్! కనీసం పాన్, పాన్‌పరాగ్..."

"నో! నాకలాంటి చెడలవాట్లు లేనేలేవు"

"పోనీ టీవీ చూసే అలవాటైనా ఉందా?"

"లేకేం? ఉంది"

"హమ్మయ్య! జీ, స్టారు చూస్తారనుకుంటాను?"

"అబ్బే! జస్ట్ జెమినీ, డిడివన్"

"అనుకున్నాను. మీ టేస్ట్ అలాగే వుంటుందని?"

"క్రికెట్ ఆడ్డం వచ్చా?"

"చూడ్డం కూడా చూడను"

"వ్వావ్! పోనీ సినిమాలు?"

"భేషుగ్గా చూస్తాను"

"నాట్ బ్యాడ్! ఏ టైపులో?"

"అన్నీనూ"

"అంటే... క్రైమ్, హర్రర్, సెక్స్...."

"నో...నో! వోన్లీ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ పిక్చర్స్ కి ప్రిఫరెన్స్"

"ఇకపోతే నా గురించి మీ ఒపీనియన్?"

"నైస్. మొహమాటం లేకుండా నిర్భయంగా మాట్లాడారు. పైగా మీరు నాకు బాగా నచ్చారు"

"థాంక్స్. నాతో పెళ్లి సంబంధం ఖాయమైతే కట్నమెంత అడగాలను కుంటున్నారు?"

"యాభైవేలు"

"ఆ! అంత తక్కువడగడమేంటి?"

"అది కూడా అడగొద్దనుకున్నాను. జస్ట్ ఫార్మాలిటీ దెబ్బతినొద్దని!"

"పోనీ మోటార్ బైక్ అడగాలనుకున్నారా? లేదా?"

"అడగాలనుకున్నాను. కానీ అది కాదు. చిన్నగా ఓ స్కూటర్"

"కంప్లీట్లీ ముద్దపప్పు"

"ముద్దపప్పా?"

"ఏ టేస్ట్ లేనిదా ముద్దపప్పు . ఎలాంటి లేటెస్టులూ తెలియనిదీ ముద్దపప్పు"

"..."

"ట్రెండ్ మారుతోంది సార్! రాముడు మంచి బాలుడు టైప్స్‌ని ఈ కాలంలో ఎవరు లైక్ చేస్తారు? అంతా ఫాస్ట్... ఫాస్ట్!

ఎక్స్‌క్లూజివ్‌గా వుండాలంటే లేటెస్ట్ ట్రెండ్‌ని ఆహ్వానించాలి.

అప్పుడే సంసారం హైటెక్‌గా వుంటుంది. మీరేకోశానా నాకు ఓకే కాలేదు. ఐయామ్ వెరీవెరీ సారీ.

**ఏ దురలవాట్లు లేని మగాడిని కొంగున ముడేసుకుంటుంది ఇల్లాలు. అలా చేయడం నాకిష్టం లేదు.**

బై!"

**(18.2.1999)**

*